క్లుప్తంగా

చిత్రలేఖనంతో ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న చిత్రకారుడు కనకరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు చిత్రలేఖనం అలవాటుగా మార్చుకుంటే ఒత్తిడి దూరమై, విద్యలో రాణిస్తారని చిత్రకారుడు ధర్మవరపు కనకరాజు అన్నారు. ధర్మవరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్ర లేఖనంపై ఆదివారం అవగాహన కల్పించారు. చిన్న చిన్న చిత్రాలు, కార్టూన్లతో ముందుగా సాధన చేయాలన్నారు. ఆసక్తి ఉన్నవారు మంచి చిత్రకారులుగా తయారవుతారని పేర్కొన్నారు. సృజనాత్మక కళ, సామాజిక స్పృహ ఉన్నవారు మంచి చిత్రాలు గీస్తారని చెప్పారు. పత్రికల్లో వస్తున్న కార్టూన్లు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

సుందరాకాండ పారాయణ సప్తాహం


సుందరాకాండ పారాయణ చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జెడ్పీ ఎదుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని షిర్డీసాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో హనుమజ్జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని సుందరాకాండ పారాయణ సప్తాహం ఆదివారం ప్రారంభమైంది. ఆధ్యాత్మిక ప్రవచకులు భాస్కభట్ల శ్రీరామశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పెంట శ్రీనివాసశర్మ నేతృత్వంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, రామకోటిలేఖనం, సుందరాకాండ పారాయణ జరిగింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటినుంచి చిన్నారులకు శిక్షణ శిబిరం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ఇల్లీసుపురం సమీపంలో తిలక్‌నగర్‌లోని పాత ఎంప్లాయిమెంట్ ఆఫీసు సమీపంలో ఉన్న యూటీఎఫ్ భవన్‌లో వేసవి వినోదం పేరిట పిల్లలకు సోమవారం నుంచి వివిధ అంశాల్లో ఉచిత శిక్షణను అందించనున్నారు. క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూన్ 3 తేదీ వరకు వారం రోజులపాటు రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. నాలుగు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఈ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ కన్వీనర్ చింతాడ కృష్ణారావు మాస్టారు ఆదివారం తెలిపారు. డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, కథ చెబుదాం, డ్రామా, చిరునాటిక, స్పెల్లింగ్ బింగో, క్విజ్, పాటలు, కవితలు, సెల్ఫ్ డిఫెన్స్, న్యూస్ రీడింగ్, కనుక్కోండి చూద్దాం, టీమ్ యాక్టివిటీస్, ఫన్ మాథ్స్, సైన్స్‌తో సరదా, ఫన్ అండ్ మెమొరీ గేమ్స్, మంటలేని వంట, డొమెస్టిక్ వర్క్, శ్రమదానం, కరాటే శిక్షణ, మేజిక్ వంటి అంశాలలో శిక్షణ, అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు.

వెంకటాపురంలో స్వచ్ఛభారత్


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నైరాలోని విద్యార్థులు జాతీయసేవా పథకంలో భాగంగా వెంకటాపురం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈసందర్భంగా వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. రహదారులకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లించారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. పరిశుభ్రతపై గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. నైరా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో గొప్పది


రక్తదానం చేస్తున్న యువకులు

ఆమదాలవలస రూరల్: సమాజంలో రక్తదానం చేయడం ఎంతో గొప్పదిగా భావించాలని సిక్కోలు చేయూత సేవా సంఘం అధ్యక్షుడు వి.గోపీకృష్ణ అన్నారు. పట్టణంలో సిక్కోలు చేయూత సేవా సంఘం ఏడో వార్షికోత్సవం సందర్భంగా లక్ష్మీనగర్ స్కూల్‌లో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 36 మంది దాతలు రక్తాన్ని దానం చేశారు. ఆపద సమయంలో రక్తం అందక చాలా మంది మృత్యువాత పడుతున్నారని, అటువంటి వారికి మరలా పునర్జన్మ ఇవ్వడానికి ఎంతగానో ఈ రక్తదానం ఉపయోగపడుతుందని తెలిపారు. సేవా సంఘం తరుపున మరిన్ని సమాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వీటీ నాయుడు, సభ్యులు గుడ్ల బాబు, బి.రామకృష్ణ, ఎస్‌వీ రమణ, కేవీఎస్ శ్రీను, మధు పాల్గొన్నారు.

• ఆలయ వార్షికోత్సవం..



శ్రీకాకుళం నగరంలోని జెడ్పీ వెనుక ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని అప్పన్నమ్మతల్లి ఆలయ మూడవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా అమ్మవారికి భక్తులు ముర్రాటలు సమర్పించి..ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

-శ్రీకాకుళం కల్చరల్

• సచ్చిదానంద స్వామి జయంతి



శ్రీకాకుళం కొత్తబ్రిడ్జి రోడ్డులో ఉన్న చిం దత్తనాథ క్షేత్రంలో గణపతి సచ్చిదానంద స్వామి 82వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాదుకాపూజ, ఆయుష్ హోమం, ఔదంబర పత్రార్చన జరిగాయి. బెహరా మనోవికాస కేంద్రానికి అవసరమైన ఉపకరణాలు అందజేసినట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గవర గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో జయలక్ష్మి మాతృమండలి సభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.

-శ్రీకాకుళం కల్చరల్

• ముత్యాలమ్మతల్లికి అర్చనలు



శ్రీకాకుళం నగరంలోని కాకివీధిలో ముత్యాలమ్మతల్లి పండగలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం కవాలి పాటలతో ముత్యాలమ్మ తల్లికి అర్చనలు జరిగాయి. సాంస్కృతిక ప్రదర్శనలలో భాగంగా దాసరి గురుమూర్తి భజన బృందం ఆధ్వర్యంలో పెద్దపాడుకు చెందిన ఈదు సతీష్ కవాలీ గీతాలను చక్కగా గానం చేశారు. కార్యక్రమంలో దమ్మల అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం కల్చరల్

శ్రీకూర్మనాథాలయానికి పోటెత్తిన భక్తులు


దేవాలయంలో దక్షిణ మంటపం వద్ద వేచి ఉన్న భక్తులు


బేడా మంటపం వద్ద క్యూలైన్‌లో భక్తులు

• శ్రీకూర్మంలో స్తంభించిన ట్రాఫిక్

గార: వైశాఖమాసం మూడో ఆదివారం శ్రీకూర్మనాథాలయానికి భక్తులు పోటెత్తారు. సుదూరం నుంచి వచ్చిన భక్తులు ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవాలయం, వైష్ణవీదుర్గ, తాబేళ్లపార్కును సందర్శించారు. దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానానికి 500 భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. సాధారణ భక్తులకు దేవుణ్ని దర్శించుకునేందుకు రెండు గంటల సమయం పట్టింది. భక్తులు రెండు క్యూలైన్ల ద్వారా స్వామివారి దర్శనానికి వెళ్లారు. ఆలయ ఈవో జి.గురునాథం, దేవస్థానసిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు. భక్తులు తీసుకువచ్చిన వాహనాల ఎక్కువగా రావడంతో శ్రీకూర్మం గ్రామంలో పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వాహనాల పార్కింగ్ చేసేందుకు దేవస్థానం దగ్గరలో అవకాశం లేకపోవడంతో భక్తులతో పాటు సమీప గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

పరామర్శ


చిన్నంనాయుడును పరామర్శిస్తున్న సాయి కుమార్

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు డోల చిన్నంనాయుడు(పెద్దయ్య) భార్య శ్రీరాములు ఇటీవల మృతి చెందింది. దీంతో ఆయనను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ ఆదివారం పరామర్శించారు. ఆయనతో పాటు సర్పంచ్ భూపతి సురేష్‌కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, విశ్రాంత ఉపాధ్యాయుడు భూపతి వెంకట రమణమూర్తి, న్యాయవాది డోల కిరణ్‌కుమార్, ఎందువ మురళీ, కిల్లారి చిన్నంనాయుడు, డోల అప్పలనాయడు, డోల రామమూర్తి ఉన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువత

రణస్థలం: మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రి ఆవరణలో ఇడదాసుల విద్యా, ఆరోగ్య సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు ఈవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, వారికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో శిబిరం నిర్వహించినట్లు తెలియజేశారు. 107 మంది రక్తదానం చేయడం జరిగిందని, సేకరించిన రక్త యూనిట్లు న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్‌కు అందజేశామని వెల్లడించారు. శిబిరాన్ని ఫౌండేషన్ సభ్యుడు మహ్మద్ తాజ్ మొహిద్దీన్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఇ.తిరుపతిరాజు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, పంచాయతీ కార్యదర్శి లింగాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేలానికి నోచుకోని వెదురు


అన్నుపురం సమీపంలో రిజర్వ్ ఫారెస్టులో ఉన్న వెదురు


వాబ సమీపంలో విస్తారంగా పెరిగిన వెదురు

సారవకోట: మండలంలోని పలు గ్రామాల్లో రిజర్వ్ ఫారెస్టులో ఉన్న వెదురు వేలానికి నోచుకోవడం లేదు. బొంతు, సవరబొంతు, వాబ, అన్నుపురం, గొర్రిబంద తదితర గ్రామాల్లోని రిజర్వ్ ఫారెస్టులో కొన్ని వందల ఎకరాల్లో ఈ వెదురు ఉంది. వెదురు ముదిరిన తర్వాత దీనిని కోసి వేలం ద్వారా విక్రయాలు చేపట్టాలి. కానీ గత దశాబ్దకాలంగా ఈ వెదురు అలాగే ఉండడంతో కొంతమంది వీటిని అక్రమంగా తరలించుకుపోతున్నారు. మండల కేంద్రంలో ఫారెస్టు సెక్షన్ కార్యాలయం ఉన్నప్పటికీ ఫారెస్టు సెక్షన్ అధికారి, బీట్ సిబ్బంది సైతం కనిపించకపోవడం విచారకరం. వీరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రతీ మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడా హాజరైయ్యే దాఖలాలు లేవు. దీంతో రిజర్వ్ ఫారెస్టులో ఉన్న వెదురు స్థితిగతులపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చే అవకాశం కూడా లేకపోవడంతో వెదురు వేలానికి నోచుకోవడం లేదు.

ప్రశాంతంగా జేఈఈ పరీక్ష


పరీక్షకు హాజరైన విద్యార్థులు


అభ్యర్థులను చెక్ చేస్తున్న సిబ్బంది


హాల్ టిక్కెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: స్థానిక గొట్టిపల్లి ఫ్లైఓవర్ వంతెన సమీపంలోని కోర్ టెక్నాలజీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-24 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్స్‌లో పరీక్షలు జరగగా ఉదయం సెషన్‌లో 320 మందికి 319 మంది, సాయంత్రం సెషన్‌లో 320 మందికి 318 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా ముగ్గురు విద్యార్థులు మాత్రమే గైర్హాజరయ్యారు. కట్టుదిట్టంగా పరీక్ష నిర్వహించారు. వచ్చిన అభ్యర్థులను మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేశారు.

ప్రమాదకరంగా వృక్షం!


ప్రమాదకరంగా ఉన్న చెట్టు

గార: మండల కేంద్రం పరిధిలోని కుమ్మరిపేట గ్రామంలో కళింగపట్నం-పాలకొండ రోడ్డుకు అనుకొని ఉన్న వృక్షం ప్రమాదకరంగా ఉంది. చెట్టుకు అనుకొని విద్యుత్ స్తంభం కూడా ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందో అని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వచ్చే సీజన్ గాలులు, వర్షాలు కురిసే అవకాశాలుండటంతో వాహనదారులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కంప్యూటర్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వెంకటనాగశ్రీవిద్య

ఎచ్చెర్ల: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు కంప్యూటర్ విజ్ఞానంపై అవగాహన అవసరమని రీసోర్స్ పర్సన్ భోగాపురం వెంకటనాగ శ్రీవిద్య అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కంప్యూటర్, భాషలు, ఆపరేటింగ్ సిస్టం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

శ్రీకాకుళం రూరల్: కనుగులవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఇప్పిలి ఫీడర్‌లో మరమ్మతులు నిమిత్తం సోమవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు సంబంధిత అధికారి ఎస్.బయ్యన్ననాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పిలి, బందరువానిపేట, ముక్తంపాలెం, గొల్లపేట, మిత్తనపేట గ్రామాలకు విద్యుత్ ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థినికి రూ. 20 వేల ఆర్థికసాయం


మేఘనకు ప్రోత్సాహక మొత్తాన్ని అందజేస్తున్న చైర్మన్ గిరిబాబు, దాతలు

కాశీబుగ్గ: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పలాస హైస్కూల్‌లో చదవి 592 మార్కులు సాధించిన విద్యార్థిని మేఘన మహారణను పలువురు అభినందించారు. ఆమె ప్రతిభను మెచ్చి ఉన్నత చదువులకు ఉపయోగపడాలని ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థిని తండ్రి రఘునాథ మహారణతో చదువుకున్న స్నేహితులంతా కలిసి 20 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు చేతుల మీదుగా మేఘన మహారణకు ఆదివారం అందించి అభినందించారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ


మరిడమ్మకు ఎస్పీ రాధిక ప్రత్యేక పూజలు


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మెడ్ రిజర్వ్ కార్యాలయం సమీపంలో వెలసివున్న మరిడమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ వైశాఖ మాసంలో ఇక్కడ మరిడమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజల్లో భాగంగా జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక అమ్మవారి పట్టు వస్త్రాలు, భోనాలు సమర్పించారు. అర్చకులు ఎస్పీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీ ఎల్.శేషాద్రి నాయుడు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, రమేష్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పండ్లు పంపిణీ


నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలోని చిన్నారులు, వృద్ధులకు ట్రూ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు, డ్రింక్స్‌ను ఆదివారం పంపిణీ చేశారు. మట్టా మహేష్‌కుమార్, పరిటాల ప్రభాకర్‌ల నాలుగో వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాన్ని చేసినట్టు శ్రీకూర్మాం దేవస్థానం పాలకమండలి సభ్యుడు పొన్నాడ రుషి, దక్షిణ హిందీ ప్రచార సభ కార్యదర్శి, సీనియర్ ఫిజియో థెరపిస్టు డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్‌లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ తాహసీల్దారు బి.ఉమామహేశ్వరరావు, పవలర్తి సునీల్ కుమార్, గర్నాపు ప్రభాకర్, కన్నబాబు, డి.నాని, ఎ.చంద్రబాబు, ఆర్.మధు, బి.శ్రీనివాస్, కె.వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు బొడ్డపాడులో అమరుల సంస్మరణ సభ


అమరులకు జోహార్లు అర్పిస్తున్న విప్లవ సంస్థల ప్రతినిధులు

పలాస: బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద సోమవారం సాయంత్రం జిల్లా అమరవీరుల సంస్మరణ సభ జరగనుంది. ఈ సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు బొడ్డపాడులో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. 1969 మే 27న తొలి బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆనాటి జిల్లా ఉద్యమ నేత పంచాది కృష్ణమూర్తితో పాటు ఏడుగురు విప్లవకారులను పట్టుకొని పోలీసులు కాల్చి చంపారని ఆరోపించారు. అనంతరం జిల్లాలో 1969 నుంచి 1973 వరకు వివిధ ఎన్‌కౌంటర్లల్లో సుమారు 360 మంది విప్లవవీరులను పట్టుకొని పోలీసులు హత్యలు చేశారన్నారు. ఆ విప్లవ వీరుల జ్ఞాపకార్థం ఏటా బొడ్డపాడులో వివిధ విప్లవ సంస్థల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్మారక సభను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా స్మారిక మందిరం వద్ద అమరులకు జోహార్లు అర్పించారు. నాయకులు తామడ సన్యాసిరావు, దుష్యంతరావు, కామేశ్వరరావు, మద్దిల రామారావు, మద్దిల కైలాస్, గొరకల బాలక్రిష్ణ, పోతనపల్లి కుసుమ, రాపాక మాధవరావు, గోపి పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా యూహెచ్‌సీ


కోసంగిపురం యూహెచ్‌సీ భవన సముదాయం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం కూడలి వద్ద ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ పనులు పూర్తయ్యాయి. మున్సిపాలిటీకి మూడు కేంద్రాలు మంజూరు కాగా అందులో ఇదొక్కటి. శరవేగంగా నిర్మితమవుతున్న జగనన్నకాలనీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ఏపీ టిడ్కో, ఎంఐజీ సైట్‌లతో పాటు పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి సుమారు ఐదు వేల మందికిపైగా ప్రజానికానికి అందుబాటులో ఉండే యుహెచ్‌సీని రూ.80 లక్షలతో నిర్మించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది. ఎన్నికల ఫలితాల అనంతరం దీనిని ప్రారంభించే యోచనలో మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

• సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు


పల్లకీసేవలో సత్యసాయి భక్తులు

కవిటి: ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం ద్వారానే మానసిక ప్రశాంతత సాధ్యమని సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షులు ఎస్.రామచంద్రరావు అన్నారు. మండలంలోని సన్యాసపుట్టుగ గ్రామంలో ఉన్న సత్యసాయి మందిరం 12వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున సాయి గాయత్రి జపాన్ని ఆచరించారు. అనంతరం నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల భజన బృందాలతో ఏకాహం, సత్యసాయి భజన కాలక్షేపాన్ని చేశారు. అనంతరం నిర్వహించిన సభలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెలలో జరగనున్న పర్తి యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు సంస్థల భజన మండలి అధ్యక్షులు బోర చిన్నారావు, ప్రియా అప్పలనాయుడు, కాశీ విశ్వనాథ్, బల్లెడ శాంతమూర్తి ఉన్నారు.